
**ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ రాజకీయ కుట్ర**




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**శుభకార్యాల్లోనూ సేవా బంధాల సుగంధం**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 190 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 06 జులై 2026


# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

**● తెలంగాణకు ఫేజ్-1 ● అప్పగింతలో వేగం పెంచాలి ● ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే అమోదం తెలపాలి ● ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించండి ● ఆలస్యమయ్యేకొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ● కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరు లేఖలు**

**హైదరాబాద్,జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1ను తెలంగాణకు బదిలీ చేసే విషయంలో వేగం పెంచాలనీ, ఫేజ్-2 నిర్మాణానికి తక్ష?ణమే ఆమోదం తెలపాలని ఆయన విన్నవించారు. ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే కొద్దీ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ఉందని మిగతా2లో...



# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు



**హైదరాబాద్,జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):**మీడియాతో చిట్‌చాట్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను తిట్టించడానికి వైసీపీ పార్టీ సోషల్ మీడియా బ్యాచ్‌కి భారీగా ఫండింగ్ ఇస్తోందని అన్నారు. డబ్బులు ఎరచూపి తమపై దుష్ప్రచారం చేయిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా2లో...

## వచ్చే మూడు రోజులు వర్షాలు..

**- హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

**హైదరాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):**బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని, ఇది ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతానికి సమీపంలో కేంద్రీకృతమై మిగతా2లో...





## మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

**- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** సల్కం చెరువు బఫర్ జోన్‌లో బారిస్టర్ ఫాతిమా ఒవైసీ విద్యా సంస్థలు ఉన్న ట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోవడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. మజ్లిస్ అంటే భయమా? ప్రేమా? లేక రెండూ ఉన్నా యా? అని ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్ర భుత్వాన్ని ప్రశ్నించారు. మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే

మిగతా2లో...

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

## - వారం రోజులు అప్పగిస్తే రాష్ట్రమంతా నీళ్లు పారిస్తాం

**● మేడిగడ్డతో అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యం ● ప్రభుత్వం స్పందించకుంటే 50వేల మందితో పంప్‌హౌస్ ముట్టడి : బీఆర్ఎస్ వర్కింగ్ ● ప్రెసిడెంట్ కేటీఆర్ పంప్‌హౌస్ పరిశీలన**



**మహదేవపూర్/ జనగామ/అదిలాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను నడపడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల బృందం జయశంకర్ ?భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది.. ఈ సందర్భంగా ?ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం 98వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని తెలిపారు. ఎంతటి కరువులోనైనా నీటి నిల్వ ఉండే అద్భుతమైన ప్రాంతం కన్నెపలి అని, మేడిగడ్డ మిగతా2లో...



## దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

**సియోల్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** సౌత్ కొరియాలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. సియోల్‌లో ఇవాళ (ఆదివారం) మంత్రి లోకేశ్‌తో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కే, ఏఎస్ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్‌ల ఆధారంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0 కోసం చర్యలు చేపట్టాలని మిగతా2లో...

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

**ప్రమాదమని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది**

**పొరపాట్లను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**

**2027 లోగా కాళేశ్వరం మరమ్మతులు పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**హైదరాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఈ ఏడాది నీరు నింపడం సాధ్యం కాదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'మూడు బ్యారేజీల ఫౌండేషన్‌లో లోపాలున్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుంది. భద్రాచలంతో పాటు దాదాపు 40 గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. ప్రాజెక్ట్ నాణ్యతతో నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. బ్యారేజీల గేట్లు దింపే

మిగతా2లో...



## మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బిఆర్ఎస్ నాయకులు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేయడం లేదని, ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ఏకైక లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం లేదని, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ స్పష్టమైన సూచనలు ఇచ్చిన తర్వాత కూడా

మిగతా2లో...

## ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**● హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ● ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబాటు ● 361 మంది లబ్ధిదారులకు 2 బీహెచ్‌కే పట్టాల పంపిణీ : మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్**




**హైదరాబాద్,జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలు ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం అవసరమైతే విలువైన ప్రభుత్వ భూములను కేటాయించడానికీ వెనుకాడబోమన్నారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా మిగతా2లో...

# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మనోహర్‌లాల్ ఖట్టర్, జి.కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో కిషన్‌రెడ్డి సమక్షంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 బదిలీ, ఫేజ్–2 విస్తరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిల్లో ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదని సీఎం ఎత్తిచూపారు. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించేందుకు అంగీరించిన విషయాన్ని గుర్తుచేశారు.ప్రస్తుతమున్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే రీఫైనాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలంటూ నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించారు. మెట్రో ఫేజ్–2 నిర్మాణానికి భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని వివరించారు. అందుకే అదే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాలు, నిధుల సమీకరణ మార్గాలు, ప్రాజెక్టు అమలుకు కావాల్సిన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను వెంటనే ఖరారు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించినట్టు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు కేంద్రం ఎస్‌బీఐ క్యాప్స్‌ను అధికారికంగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదని గుర్తుచేశారు.దీంతో మెట్రో ఫేజ్–1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందనీ, రోజువారీ నిర్వహణలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ క్యాప్స్ జాప్యం వల్ల మెట్రో ఫేజ్–2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల నిధుల సమీకరణ ముందుకు సాగట్లేదనీ, ప్రాజెక్టు ప్రారంభం మరింత ఆలస్యమవుతున్నదని తెలిపారు. ఇలా ఆలస్యమయ్యే కొద్దీ ధరల పెరుగుదల, వడ్డీ భారం, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం వంటి కారణాలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటనీ, పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్–1 బదిలీ పూర్తయి, ఫేజ్–2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా నగరాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సీఎం కోరారు.

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీతో అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి ఫ్లడ్ ఫ్లో ద్వారా మిడ్ మా నేరు, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని పేర్కొన్నారు. నీళ్లు ఇవ్వాలని రైతులు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, రసమయి బాలకి షన్ కోరినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కన్నెపల్లి పంపులు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయనే విషయం కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుస న్నారు. ఒకవేళ నీళ్లిస్తే రైతులకు యూరియా, మద్దతు ధర, బోనస్, 24 గంటల కరెంట్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ మోటా ర్లు ఆన్ చేయడం లేదని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందన్నారు. కేసీఆర్‌కు వారం రోజు లు కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగిస్తే రాష్ట్రమంతటా నీళ్లు పారిస్తామని సవాల్ విసిరారు.

**హైదరాబాద్‌కు తాగునీటి సంక్షోభం**

రాష్ట్రంలో 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తాము మూడు నెలల క్రితమే హెచ్చరించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఉమ్మడి ఏడు జిల్లాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ కు తాగునీరు అందించే సామర్థ్యం కాళేశ్వరానికి ఉందన్నారు. కాంగ్రెస్ చేతకానితనం వల్ల ప్రాజెక్టును పడావు పెట్టడంతో హైదరాబాద్‌లో రోజుకు 15 వేల వాటర్ ట్యాంకర్లు తిరుగుతున్నాయని అన్నారు. త్వరలోనే తీవ్ర తాగునీటి సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రూ.94 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే .. అందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడంపై కేటీఆర్ మండిపడ్డారు. 'సీఎం రేవంత్‌రెడ్డికి సోయి ... మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్పృహ ఉందా..అని ప్రశ్నించారు. కాళేశ్వరం వల్లే రాష్ట్రం వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటి నెంబర్ వన్ స్థానాని కి చేరిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సుంకిశాల గోడ కూలినా, వట్టెం పంప్‌హౌస్ కొట్టుకుపోయినా, ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలి ఎనిమిదిమంది చనిపోయినా పట్టించుకోని ప్రభుత్వం, కాళేశ్వరంపై మాత్రం విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు. కక్షపూరిత రాజకీయాలు పక్కన పెట్టి కన్నెపల్లి మోటర్లు నడపాలని, లేనిపక్షంలో 50 వేల మంది రైతులతో కలిసి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పర్యటనలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన ఉద్రిక్తం**

కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన సందర్భంగా జనగామ జిల్లా పెంబర్తి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంప్‌హౌస్ సందర్శనకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ కాన్వాయిను పెంబర్తి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, కేటీఆర్‌తో పాటు వస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతుల వాహనాలను పలుచోట్ల నిలిపివేశారు. పెంబర్తి వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కేటీఆర్ కాన్వాయి ముందుకు సాగలేకపోయింది. దీంతో కేటీఆర్ వాహనం దిగి పోలీసు అధికారులతో మాట్లాడారు. అంతలో అక్కడికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి లేదు. నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయడం సాధ్యం కాదు' అని ఉత్తమ్ ఈ సదర్భంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత కమీషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని విమర్శించారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయని భావించి చేసిన తప్పిదం ఉత్తర తెలంగాణకు శాపంగా మారిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు కూడా నీరివ్వలేక పోయారని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ సాగర్, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, డిండీ మొదలగు ప్రాజెక్ట్‌లన్ని అసంపూర్తిగానే ఉన్నాయని గుర్తు చేశారు.తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది కూడా ఆయన హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు ఆన్ చేసి నీరివ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టును సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ఇంజినీరింగ్ కోణంలో చూడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యంత కీలక అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్ 24న కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ పూర్తి స్థాయి నివేదిక ఇస్తూ పలు సిఫారసులు చేసిందని మంత్రి గుర్తు చేశారు. అది చేసిన సూచనల మేరకు గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు వంటి అత్యాధునిక పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ పనులను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), ఐఐటీ ముంబాయి, ఎన్‌డీఎస్ఏ, కేంద్ర జల సంఘం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. భద్రతపై పూర్తి స్థాయి నమ్మకం వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొని పంపింగ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అపోహలు సృష్టించే రాజకీయ ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ వద్ద కనిష్ట పాండ్ లెవెల్ లేకపోవడంతో కన్నెపల్లి పంపింగ్ అసాధ్యంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో డిజైన్లను ఖరారు చేసి, వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వివరించారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో కలిసి మంత్రి 361 మంది లబ్దిదారులకు 2 బీహెచ్‌కే గృహాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పేదలు వివిధ వృత్తుల ద్వారా ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ప్రభుత్వ భూములను వినియోగిస్తామని చెప్పారు. గత పదేండ్లుగా ఇండ్ల కోసం ఎదురుచూస్తూ పేదలు పడిన ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఆ ఆలస్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని, ఇకపై సంక్షేమ పథకాల అమలులో జాప్యానికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన ప్రతి కుటుంబానికి 48 గంటల్లోనే రేషన్ కార్డు జారీ చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో మరో రెండు లక్షల సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు.

వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద నిర్మించిన పాత భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త గృహాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొత్త ఇండ్ల కేటాయింపులో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ.. పేదలకు శాశ్వత నివాసం కల్పించడం సామాజిక న్యాయంలో భాగమని, ప్రభుత్వం నిరంతరం పేదల పక్షాన నిలుస్తుందన్నారు.ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. మొత్తం 361 మంది లబ్దిదారులకు గృహాల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

ఇందులో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన 187 మంది, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన 79 మంది, నాచారం కాలనీకి చెందిన 95 మంది లబ్దిదారులు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుమార్, వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్, గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల అధికారులులు, పాల్గొన్నారు.

# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. రాష్ట్రంలో సైబర్ దాడులు, అసభ్య పోస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# వచ్చే మూడు రోజులు వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వచ్చే 24 గంటల్లో ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. దీని ప్రభావంతో వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.వర్షాలు కురిసే సమయంలో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నది. భారీ వర్షాలు కురుసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, రాబోయే మూడ్రోజులు గుజరాత్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లోని ప్రాంతాలకు విస్తరిస్తాయని వెల్లడించింది.

# మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన దుయ్యబట్టారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని ఆయన దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ సెలక్టివ్ గవర్నెన్స్ (పక్షపాత పాలన)కు హైడ్రా ఓ ఉదాహరణ అని తెలిపారు.సామాన్య ప్రజల విషయంలో మాత్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటూ మీనమేషాలు లెక్కిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో రావడం లేదని, హైడ్రా, విద్యా శా ఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా సామాన్య ప్ర జల విషయంలో చూపే తొందరపాటును ఫాతిమా కాలేజ్ వ్యవహారంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూపించడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మజ్లిస్ పార్టీని యా వత్ ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఇది పూర్తిగా తప్పు. హైడ్రా చర్యల వల్ల పేద ముస్లింల ఇళ్లు కూడా కూల్చివేయబడ్డాయని, వారి జీవనోపాధి దెబ్బతిన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వారి తరఫున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆ యన తెలిపారు.కానీ ఒవైసీ సోదరుల ఆస్తుల విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదని, తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోందని స్పష్టంగా అర్థమవుతోందని ఆ యన పేర్కొన్నారు. ఫాతిమా విద్యా సంస్థల వ్యవహారం కాం గ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలను, మజ్లిస్ ద్వం ద్వ వైఖరిని బట్టబయలు చేసిందని ఈ రెండు పార్టీలకు తా ము ముస్లిం సమాజానికి ప్రతినిధులం అని చెప్పుకునే హ క్కులేదని ఈ విషయం తేటతెల్లం చేసిందని తెలిపారు.

# దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

గౌరంగలాల్ దాస్‌ని లోకేశ్ కోరారు. ఇందుకు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఏపీలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా–అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఏప్రిల్ 2026లో సౌత్ కొరియా అధ్యక్షుడు లీ జే–మ్యుంగ్ భారత్ పర్యటన సందర్భంగా 'కొరియా ఎన్‌క్లేవ్'కు సిద్ధంగా ఉన్నామన్నారు. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ప్లగ్–అండ్–ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని ఈ సందర్భంగా గౌరంగలాల్ దాస్‌ను కోరారు. అనంతపురంలో కియా, హ్యుందాయ్ మోబిస్ ఆటో–ఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపైనా వారిద్దరూ చర్చించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డీ హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్, బ్యాటరీ/గ్రీన్–హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ సూచించారు. ఏపీ–సౌత్ కొరియా మధ్య సంబంధాల బలోపేతానికి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొరియా ప్లస్, ఖూ=ఖూ, భారత్–కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక ఏపీ–కొరియా డెస్క్ ఏర్పాటు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. 10న నిర్వహించే సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో, +2+ అవగాహన ఒప్పందాల వైపు మళ్లించేలా చొరవ చూపాల్సిందిగా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌కి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయొద్దని, కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరించారని గుర్తుచేశారు.అయినప్పటికీ కెటిఆర్, కెసిఆర్‌లు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంగా కాకుండా బిఆర్ఎస్ అవినీతికి ప్రతీకగా మారిందని ఆరోపించారు. లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరమైందన్నారు. మేడిగడ్డ కుంగిపోవడం, పంపులు మునిగిపోవడం, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతికి శాశ్వత సాక్ష్యాలన్నారు. ఇది నీళ్ల ఎత్తిపోతల పథకం కాదని, నిధుల ఎత్తిపోతల పథకమని తెలంగాణ ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. కెటిఆర్ ఒక మాట, కెసిఆర్ మరో మాట మాట్లాడుతున్నారని, నిజంగా తమ మాటలపై విశ్వాసం ఉంటే ఢిల్లీలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎదుట తమ వాదనను నిరూపించాలని సవాల్ విసిరారు. మీడియా కెమెరాల ముందు డ్రామాలు చేయడం కంటే నిపుణుల ముందు నిలబడి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ప్రకటిత ఇంజినీర్ల మాటలు వినదని, నిపుణుల సూచనల మేరకే ముందుకుసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ రాజకీయ కుట్ర

**మోడీ బిజెపి మాలల పట్ల చిన్నచూపు తగదు**

**59 ఎస్సీ కులాలకు రిజర్వేషన్లు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు**

**ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలి**

**విలేకరుల సమావేశంలో మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్**



**ఖమ్మం, ప్రతినిధి జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్సీ వర్గీకరణ పేరుతో మోడీ బిజెపి ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తుందని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో చట్టం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షులుడాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. ఖమ్మం అంబేద్కర్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షులుడాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మాట్లాడుతూ... మోడీ బిజెపి ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చు రేపుతుందని, మాలల పట్ల చిన్న చూపు చూస్తూ మాల సామాజిక వర్గాన్ని అణచి వేసేందుకు కుట్ర చేయటం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్ లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నామమాత్రంగా అమలు చేస్తున్నాయని, రెండు తెలుగు రాష్ట్రాలలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి లు 59 ఎస్సీ కులాలకు రిజర్వేషన్లు ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాలలను తడి గుడ్డతో గొంతులు కోస్తుందని ఆరోపించారు. సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు అని మోడీ బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశారు. దళితుల ఐక్యతపై కుట్ర చేయటం మానుకోవాలని, మాల వర్గం పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరైనది కాదని పేర్కొన్నారు. మాలలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకూడదని, పార్లమెంట్ లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చట్టం చేసే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దారుణం అన్నారు. తప్పు జాతి పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని, దీనిని ఎదుర్కొనేందుకు మాలలు సిద్ధంగా ఉండాలని, తమ జాతి ఉనికిని కాపాడుకోవడం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జా శరత్ మోహన్ దాసరి రమేష్, బీరం సతీష్ కుమార్, , పలిగిరి కనకరాజు,వేచల దారా నూకరాజు, లింగాల రవికుమార్, వీరభద్రం,కామా ప్రభాకర్, అమ్మదాల ఉపేంద్ర కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించినందుకే పాలాభిషేకాలా? మొర్రి రాజు యాదవ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల సమయంలో రైతులకు ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా అమలు చేయకుండా రైతులను మోసం చేసినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పాలాభిషేకాలు చేసుకుంటోందా అని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యువజన అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ ప్రశ్నించారు.ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు ఎకరానికి రూ.15 వేల రైతుబంధు అందిస్తామని నమ్మబలికిందని, కానీ ప్రస్తుతం రూ.12 వేలకే పరిమితం చేసి రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులు కష్టపడి పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో పాటు కొనుగోలు చేసిన పంటకు సకాలంలో చెల్లింపులు చేయడంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.రైతాంగాన్ని పట్టించుకోకుండా వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్న ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుబంధు పూర్తిస్థాయిలో అందరికీ అమలు కాకముందే ప్రభుత్వం అన్ని హామీలు నెరవేర్చినట్లుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. వర్షాకాలంలో రైతులకు ఎలాంటి కొరత లేకుండా ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ప్రస్తుతం కొన్ని వరి వంగడాలకు మాత్రమే మద్దతు ధర వర్తింపజేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన తర్వాతే సంబరాలు చేసుకోవాలని, ప్రజల కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం కాకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయకపోతే రైతులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీదర సంతోష్, వార్డు సభ్యుడు ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.


# శుభకార్యాల్లోనూ సేవా బంధాల సుగంధం

**- గ్రామీణ వైద్యుల ఐకమత్యానికి పెద్దమనగాల వివాహ వేడుక సజీవ సాక్ష్యం**

**- ఒక కుటుంబంగా నిలిచి ఆనందాలను పంచుకుంటూ సమాజానికి స్ఫూర్తిగా గ్రామీణ వైద్యులు**

**- తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్**





**ఖమ్మం ప్రతినిధి, జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మనిషి జీవితంలో సుఖదుఃఖాలను పంచుకునే ఆత్మీయ బంధాలే నిజమైన సంపద అని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యుల కుటుంబాలు అపూర్వమైన అనుబంధాలకు, పరస్పర ప్రేమాభిమానాలకు, సేవా స్ఫూర్తికి ఒక ప్రతీక అన్నారు. ఖమ్మం జిల్లా, కొనిజర్ల మండలం, పెద్దమనగాల గ్రామంలో సీనియర్ గ్రామీణ వైద్యులు రొంటే రామలింగం కుమారుడి వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వైద్య సేవల ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిత్యం నిమగ్నమై ఉండే గ్రామీణ వైద్యులు, వ్యక్తిగత జీవితాల్లోనూ ఒకరికొకరు అండగా నిలుస్తూ, ఒకే కుటుంబ సభ్యుల్లా మమేకమవడం ఈ వేడుకలో స్పష్టంగా కనిపించిందన్నారు. ఆనందాలను పంచుకోవడం, ఆప్యాయతలను వ్యక్తపరచడం, పరస్పర సహకారాన్ని చాటడం ద్వారా గ్రామీణ వైద్యుల మధ్య ఉన్న బంధం మరింత బలపడిందన్నారు. ఈ వివాహ మహోత్సవానికి తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నరపు నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మర్రి నరేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి సంపత్, జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ చారి, కొనిజర్ల మండల కార్యవర్గ సభ్యులు దోర్నాల లోకేష్, సీనియర్ గ్రామీణ వైద్యులు నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ వైద్యుల మధ్య నెలకొన్న ఐకమత్యం కేవలం సంఘటిత శక్తికే పరిమితం కాదని, అది కుటుంబ బంధాలకంటే గొప్పదైన ఆత్మీయ అనుబంధమని పేర్కొన్నారు. ఏ కుటుంబంలో శుభకార్యం జరిగినా అందరూ కలిసి పాల్గొని బాధ్యతను పంచుకోవడం, ఆనందాన్ని రెట్టింపు చేయడం గ్రామీణ వైద్యుల సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తూనే, పరస్పరం సహకరించుకోవడం ద్వారా సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడం గ్రామీణ వైద్యుల ప్రత్యేకత అని వారు అన్నారు. ఇలాంటి ఐకమత్యం సమాజానికి మేలుకరంగా మారడమే కాకుండా యువతకు విలువలు, బాధ్యతలు, కుటుంబ అనుబంధాల గొప్పతనాన్ని తెలియజేస్తుందని అభిప్రాయ పడ్డారు.వివాహ వేదిక ఆప్యాయ పలకరి ంపులు, చిరునవ్వులతో, శుభాకాంక్షలతో కళకళలాడి ంది. సహచర వైద్యుల రాకతో రొంటే కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరి ఇంటి శుభకార్యాన్ని అందరి పండుగగా భావించే ఈ సంస్కృతి గ్రామీణ వైద్యుల ఐకమత్యానికి చిరస్థాయిగా నిలిచే నిదర్శనంగా మారింది.సేవే ధర్మంగా, మానవత్వమే మార్గదర్శ కంగా, సోదరభావమే బలంగా ముందుకు సాగుతున్న గ్రామీణ వైద్యుల ఈ ఐక్యత సమాజ నిర్మాణానికి మరింత బలాన్ని చేకూర్చాలని పలువురు ఆకాంక్షించారు.

# అంజి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ కార్యాచరణ సమావేశం

- **జూలై 7న ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపు**
- **అన్ని డివిజన్లలో జెండా ఆవిష్కరణ, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం**
- **ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకుల పిలుపు**





**ఉప్పల్ జూలై 050 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూలై 7న న జరిగే 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతో పాటు వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు.నాచారంలో ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాచరణ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ మాట్లాడుతూ,నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చదువుల్లో ప్రతిభ కనబర్చిన అణగారిన వర్గాల విద్యార్థులను సన్మానించాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం నాలుగు దశాబ్దాలుగా మంద కృష్ణ మాదిగ చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో బండారి సాయి మాదిగ, చోళ రమేష్ మాదిగ, చేవెళ్ల రమేష్, మల్లయ్య, బ్రమ్మ, అజయ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్యరహిత పర్యావరణాన్ని భావితరాలకు అందించాలి



**హైదరాబాద్, జూలై 5(పిసిడబ్ల్యూ న్యూస్):** భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నారాయణ ఈ టెక్నో విద్యా సంస్థల జనరల్ మేనేజర్ కె.గోపాల్ రెడ్డి అన్నారు. నారాయణగూడ నారాయణ ఈ టెక్నో హైస్కూల్లో ప్రిన్సిపాల్ విశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఘనంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వాయు, శబ్ద కాలుష్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడాలిసన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యం, వాతావరణం అందించే మొక్కలు పెంపకం అత్యంత అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. మొక్కల పెంపకం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండవ డివిజన్ తీగలగుట్టపల్లిలో సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్ జూలై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండవ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అపార్ట్మెంట్ ఆవరణలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ప్రతి కాలనీలో ఇలాంటి ప్రజా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అవసరమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిరంతరం సహకారం అందిస్తున్నారని తెలిపారు. మలయప్ప ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు, రెండవ డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం - అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత...

### రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

### అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

### కల్లూరు మండలంలో 15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి








**కల్లూరు, జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు లలోనె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండ గ్రామంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపడుతున్న చిన్నకోరుకొండి - కిష్టారం మరియు వైరా - నెమలి రహదారులు మధ్య ఉన్న లింక్ రోడ్ కు, తర్వాత రూ. 6కోట్ల 30లక్షల వ్యయంతో లోకవరం పెనుబల్లి రహదారి పై హైలెవల్ బ్రిడ్జి పనులకు ఆనతరం నగరాభివృద్ధి లో భాగంగా కల్లూరు ప్రధాన రహదారి లో రూ.93 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు, అలాగే తిరువూరు ఎక్స్ రోడ్ కల్లూరు జంక్షన్ వద్ద రూ.8కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో ఖమ్మం నుండి అశ్వరావు పేట జాతీయ రహదారి జంక్షన్ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల విశ్వాసంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళల సాధికారత, రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రజలు అందించిన ఆశీస్సులు, దీవెనల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల ఇంటి ముంగిటకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అర్హత కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గతంలో పేదలకు అందని సన్న బియ్యాన్ని ఇప్పుడు రేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వని పరిస్థితిని మార్చి అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటిని సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేశామని, అనంతరం కూడా దశలవారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.6 వేల చొప్పున టిగ్..టిగ్ అనె మెసేజ్ ద్వారా జమ అవుతున్నాయని, రెండు మూడు రోజుల్లో పూర్తిగా అందరికీ జమ అవుతాయని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తాను కల్లూరు మండలంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, పాలేరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ సత్తుపల్లి నియోజకవర్గం కూడా తన సొంత ప్రాంతమేనని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని, ఇప్పటికే సుమారు రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ రూ.15 కోట్ల పనులతోనే అభివృద్ధి ఆగిపోదని, కొత్త మున్సిపాలిటీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## కరీంనగర్ LMD 'మినీ బీచ్' వద్ద పిల్లల ప్రాణాలకు ముప్పు.. భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



**కరీంనగర్ టౌన్ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్: నగరంలోని ఎంఆర్వో కార్యాలయం సమీపంలో ఉన్న లోయర్ మానేర్ డ్యామ్ (రావిణ) చివరి భాగంలోని 'మినీ బీచ్' ప్రాంతం రోజురోజుకు ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారుతోంది. బీచ్‌ను తలపించే తీరం, ప్రవహించే నీరు, అలల అందాలను ఆస్వాదించేందుకు ప్రతిరోజూ కుటుంబాలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకు బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, లైఫ్‌గార్డులు లేదా భద్రతా సిబ్బంది లేకపోవడంతో సందర్శకులు నేరుగా నీటిలోకి దిగుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు బలమైన అలల్లో ఆడుతుండగా, పెద్దలు కూడా వారితో కలిసి నీటిలోకి వెళ్లడం ప్రమాదాలకు దారితీస్తోంది. స్థానికుల సమాచారం ప్రకారం, గత ఏడాది కాలంలో ఈ ప్రాంతంలో పలు నీట మునిగే ఘటనలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ, చాలా మంది సందర్శకులు ప్రమాదాలను పట్టించుకోకుండా ఈ ప్రాంతాన్ని విహారయాత్రకు అనువైన బీచ్‌గా భావించి నీటిలోకి దిగుతున్నారు. నదీ గర్భంలో ఉన్న లోతైన గుంతలు, నీటి ప్రవాహంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు, బలమైన అలల కారణంగా ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారుతుందని అధికారులు గతంలోనే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో విషాదం జరగకముందే భద్రతా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, లైఫ్‌గార్డులు, భద్రతా సిబ్బందిని నియమించాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి ప్రవేశాన్ని నియంత్రించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అలాగే సందర్శకులు బలమైన అలలకు దూరంగా ఉండాలని, అవసరం లేకుండా నీటిలోకి దిగవద్దని, చిన్నారులను ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరుతున్నారు.

---

## రెండో డివిజన్ సరస్వతి నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ జిల్లా జూలై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని సరస్వతి నగర్, రోడ్ నెం. 5లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

---

## 57వ డివిజన్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర మడేలేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 57వ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర మడేలేశ్వర స్వామి దేవస్థానాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మేయర్‌కు స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం మేయర్ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ ప్రజలు, భక్తులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



---

## సత్తుపల్లి అభివృద్ధికి రూ.5.75 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన




### జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆధునిక క్రీడా మైదానం

### బుగ్గపాడు, యాతాలకుంట హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం

**సత్తుపల్లి, జూలై 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో అవుట్‌డోర్ ప్లే ఫీల్డ్ అభివృద్ధి పనులు, రన్నింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్టు, వాలీబాల్ కోర్టు, సీటింగ్ గ్యాలరీ, పాదచారుల మార్గం తదితర ఆధునిక క్రీడా సౌకర్యాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విద్యార్థులు, యువతకు నాణ్యమైన క్రీడా వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట గ్రామ సమీపంలో రూ.3.75 కోట్ల అంచనా వ్యయంతో బుగ్గపాడు, యాతాలకుంట రహదారిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరనుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో బోనం ఎత్తిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ మరియు రామచంద్రపురి కాలనీలలో ఘనంగా నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని, సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, నాంపల్లి రేణుక శ్రీనివాస్, పొన్నం లక్ష్మి మొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రత్యేక సమగ్ర సమావేశం




**- నెక్కొండ మండల తాసిల్దార్ వేముల రాజకుమార్.**

**నెక్కొండ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని నెక్కొండ రైతు వేదిక నందు బి ఎల్ ఓ లు మరియు బి ఎల్ ఎ లకు సర్ పై ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది, భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులకు ఓటర్ల జాబితాలో చేర్చి అనర్హుల జాబితాలో లేకుండా ఉండేందుకు పకడ్బందీగా ఫామ్స్ నింపి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ నిర్వహిస్తుంది, అని ప్రతి గ్రామంలోని ఎమ్యూనరేషన్ ఫారం సరైన పూర్తి వివరాలు సరి చూడాలని తెలియజేశారు. ఇట్టి ట్రైనింగ్ కార్యక్రమం కు తహసిల్దార్ రాజ్ కుమార్ , డిప్యూటీ తహసిల్దార్ పల్లకొండ రవి , సీనియర్ అసిస్టెంట్, ఎమ్మార్ఐ, ఏ ఆర్ ఐ నెక్కొండ మండలానికి చెందిన బిఎల్వోలు, బిఎల్ఓ లు సూపర్వైజర్లు, బి ఎల్ ఎ లు పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ విగ్రహం తొలగిస్తే ఆందోళనలు తప్పవు



**- బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్**


**షాద్ నగర్,జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**షాద్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ (అడ్వకేట్) హెచ్చరించారు. ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే మహానీయుడని, ఆయన విగ్రహాన్ని చౌరస్తా నుంచి తొలగించే ఎలాంటి చర్యలనైనా సహించబోమని స్పష్టం చేశారు. గతంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని చౌరస్తాను విస్తరించి అదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణకు బీఎస్పీకి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే విగ్రహాన్ని పూర్తిగా తొలగించే ప్రయత్నాలు జరిగితే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు గుండేటి నర్సింలు, జి. బాలయ్య, తుప్పరి కుమార్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నీరటి రాజు, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శివగల్ల ఆంజనేయులు, చౌదర్‌గూడ మండల అధ్యక్షుడు చెన్నయ్య,

# రైతు సంబరాలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

### రైతు సంక్షేమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత: కార్పొరేటర్ & కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్








**కరీంనగర్ టౌన్ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**రైతు సంక్షేమే ప్రజా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతగా, వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. జూలై 4, 2026 నాటికి... 67.44 లక్షల మంది రైతులకు 1 1.18 కోట్ల ఎకరాలకు రూ. 7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ బొమ్మకల్‌లో మరియు కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతన్నలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, రైతు భరోసా ద్వారా లక్షలాది రైతులకు అండగా నిలుస్తోందని అన్నారు. ఈ దేశంలో రైతుల పక్షాన నిలబడి రైతులకు ఏదైనా సంక్షేమం చేసిందంటే అది కాంగ్రెస్ పార్టీయే. దేశవ్యాప్తంగా గత యూపీఏ ప్రభుత్వంలో రైతులకు ఏకాలంలో రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్సే. నేడు అదే స్ఫూర్తితో రేవంత్ అన్న ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఏకాలంలో రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయడంతో పాటు, రైతులకు ఉచిత కరెంటు, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ వంటి అనేక కార్యక్రమాలతో రైతులకు అండగా నిలుస్తోంది. రైతు ప్రభుత్వాన్ని, రేవంత్ అన్న నాయకత్వాన్ని మరొక్కసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె. రాంరెడ్డి, సాయిని తిరుపతి, బొమ్మకల్లు జరిగిన కార్యక్రమంలో కపిల్ మాధవ్, గట్టు ప్రశాంత్, దీ. ఆంజనేయులు, ఇమ్రాన్, పెంట శేఖర్ వసీం ఫాహాద్, ఇమ్రాన్ గాని, చామనపల్లి గ్రామ రైతు వేదిక లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఐలన్న, సర్పంచ్ తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫకీర్‌పేట్, సర్పంచ్ లక్ష్మణ్ నారాయణ, సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, తిరుపతి గౌడ్, సేవాదళ్ నాయకుడు ముస్తాక్, హైమద్, హరీష్ గౌడ్, శివరాం, మీసాల సాయన్న, కాశిపాక మురళి, బాలకిషన్ తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత కొత్త ఆలోచనలతో వ్యాపార రంగంలో ఎదగాలి






### ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి డి.ఎన్ స్పోర్ట్స్ అండ్ స్టేషనరీ స్టోర్‌ని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్ నగర్,జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** షాబాద్ మండల కేంద్రంలో ఉత్తరాస్ పల్లి గ్రామ యువకులు దినేష్ కుమార్ ఏర్పాటు చేసిన డి.ఎన్ స్పోర్ట్స్ అండ్ స్టేషనరీ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్టోర్ యజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారంలో విజయవంతంగా ముందుకు సాగాలని, ఈ సంస్థ స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. యువతకు అవసరమైన క్రీడా సామగ్రి, స్టేషనరీ వస్తువులు ఒకే చోట అందుబాటులోకి రావడం సంతోషకరమని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ, మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,ఉత్తరాస్ పల్లి ఉపసర్పంచ్ హాలీం,మాజీ సర్పంచ్ హరినాయక్, యువనాయకులు సంజీవ రెడ్డి, అనుమారి రాజు,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియం అభివృద్ధికి కృషి...: ఎంపీ బలరాం నాయక్







**మహబూబాబాద్ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తెలిపారు. ఆదివారం పార్లమెంట్ కేంద్రంలోని ఎన్టీఆర్ ( స్టేడియంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా స్టేడియానికి వచ్చే వాకర్స్ అందరితో కలిసి నడుస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాకర్స్ తమ స్టేడియంలో ఉన్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నింటినీ ఓపికగా విన్న ఎంపీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. **ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన వాకర్స్** గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ ప్రత్యేక నిధుల నుంచి స్టేడియం ముందు బాగాన పహారీ గోడ (రక్షణ గోడ) కట్టించినందుకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు ఎంపీ బలరాం నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక శిబిరాల క్షేత్రస్థాయిలో పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కర్నూలు జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు.ఆదివారం జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నగరంలోని రామచంద్ర మిషన్ సమీపంలోని స్వర్ణవార్డు47 సచివాలయం, కేంద్రీయ విద్యాలయ పాఠశాల, బిషప్ చర్చ్ సెయింట్ జోసెఫ్ పాఠశాల, సోమిశెట్టి నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని స్వర్ణవార్డు47,అలాగే డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలు సమర్పించే దరఖాస్తులు, అవసరమైన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి వెంటనే సంబంధిత పోర్టల్‌లో డిజిటలైజ్ చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, వార్డులు, కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అధికారులు, బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి బి.ఎల్.ఓకు సహాయకులుగా ఐసీడీఎస్,మెప్మా, డ్వామా, డీఆర్‌డీఏ తదితర శాఖల నుంచి సిబ్బందిని కేటాయిం చడం జరిగిందని, వారి సేవలను వినియోగించుకుని సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు.ఈ తనిఖీలలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - వినాయక ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**పత్తికొండ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** రానున్న కాలంలో సీజనల్ వ్యాధుల బెడద ఎక్కువగా ఉంటుందని ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా అవి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చిలకల సాయికిరణ్, సాయి మంజునాథ్,డాక్టర్ దాస్, స్త్రీ వ్యాధి వైద్యురాలు షబానా అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా పత్తికొండ కర్నూలు రహదారిలో వెలసిన వినాయక ఆసుపత్రిలో డాక్టర్స్ డే ను పురస్కరించుకొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ప్రజలను పరీక్షించి వారికున్న సమస్యలను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు భారీగా ఈ వైద్య శిబిరానికి వచ్చి తమ ఆరోగ్యాలను పరీక్షించుకున్నారు. వినాయక ఆసుపత్రి సేవలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి నిర్వాహకులు హరి,బాలప్ప తెలిపారు.ఉచిత వైద్య శిబిరంలో ప్రజలను పరిష్కరించి వారికి ఉచిత మందులు అందించడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేసి వినాయక ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### - ఈదుముడికి పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని నాయకుల పిలుపు



**పత్తికొండ జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**మండలంలోని పందికొన గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కోట్లాది మంది మాదిగలను ఏకం చేస్తూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ నిరంతర పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు.మాదిగలపై జరుగుతున్న అన్యాయాలు, కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై ఉద్యమిస్తూ, మాదిగ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని అన్నారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులికొండ మాట్లాడుతూ, జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి, ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మాదిగలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ నరసింహులు మాట్లాడుతూ..గ్రామ గ్రామాన తిరుగుతూ మాదిగల్లో ఉద్యమ చైతన్యం కల్పిస్తున్నామని, ఏబీసీడీ వర్గీకరణ అమలు సాధన లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు ఈదుముడి పుణ్యక్షేత్రానికి తరలివచ్చి వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉచ్చురప్ప, ముత్యాల ప్రసాద్, నరశ్యామల, రామాంజినేయులు, మండల నాయకులు నరసింహులు, రంగస్వామి, గిరిప్రసాద్, రంగయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిందితుల్ని కఠినంగా శిక్షించాలి



**బద్వేలు జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్డులోని బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న బద్వేలు పెద్ద మసీదు వెనుక రౌఫ్ అనే వ్యక్తి మరియు అతని సహచరులు కలసి గోమాతలను అక్రమంగా తీసుకొని వచ్చి వధించుతున్నారు. విషయం తెలుసుకున్న మన హిందూ సంఘాలు అందరూ ఒక్కటై ఈ గోవధను అడ్డుకోవడం జరిగింది. గోవధ చేయడం తప్పు, నేరం అని వివరంగా చెప్పినప్పటికీ ఏమాత్రం లెక్కచేయక గోవధే ధ్యేయముగా ఒక ఆవును వధించడం జరిగింది. వీరికి శిక్ష పడాలని శంకల్పముతో ఈరోజు ఉదయం 10:00 గంటలకు హిందూ సంఘాల పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో విశ్వ హిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీ, భజరంగ్ దళ్, ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘము, అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు, కార్యకర్తలు బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి గోవధ చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని బద్వేలు అర్బన్ ఇన్స్పెక్టర్ చిరంజీవి గారిని కోరగా అతను తక్షణమే స్పందించి గోవధ చేసిన రౌఫ్ గతములో కూడా పలు కేసులు ఉన్నాయని,బైండొవర్ తదితర నేర చరిత్ర ఉన్నాదని కేసును నమోదు చేయామని, బద్వేలు మండల తహసీల్దారు గారితో కూడా సంప్రదించామని, గోవధ జరిగిన దానిని పోస్టుమార్టం పరీక్ష నిమిత్తం పంపామని, నిందుతున్ని అరెస్టు చేశామని, ఎఫ్.ఐ.ఆర్ నెంబర్.101/2026 గా కేసు నమోదు చేశామని, త్వరలో రిమాండుకు పంపుటకు తగు చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో బద్వేలు పట్టణములో ఇలాంటి గోవధ జరుగకుండా తగు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంరామని తెలియజేసారు.ఈ కార్యక్రమములో బద్వేలు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బద్వేలు ఖండ కార్యవాహ అక్కి సంజీవ రెడ్డి, బద్వేలు ఖండ సంఘటన ప్రముఖ్ సాకి ఈశ్వరయ్య, బిజెపి కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, శ్రీరాములు, బద్వేల్ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్, పట్టణ జనరల్ సెక్రటరీ మేడిపోయిన ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ముఖం శ్రీనివాస్ కుమార్ రాయల్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యవాహ పత్తిపాటి నరసింహులు,పోకూరి తిరుపాలయ్య బద్వేల్ మండల విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు పెద్ది సుధాకర్, నరసింహారెడ్డి,ఏ.పీ.యు.ఎస్ మతం మండలాధ్యక్షులు చెన్న కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ బద్వేల్ సీనియర్ నాయకులు బోరెడ్డి రఘునాథరెడ్డి, కృష్ణారెడ్డి,రాజేష్,గురు ప్రసాద్,మల్లికార్జున రెడ్డి,అనాల నరసింహ ప్రసాద్,నానబాల శ్రీనివాసులు,నందగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి:ఏపీ జేఏసీ

### పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పణ



**పీలేరు జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, కార్మికులు,పెన్షనర్లకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ (అమరావతి) అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీలేరు శాసనసభ్యుడు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగుల పక్షాన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి,పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని, వైద్య, ఆరోగ్య శాఖలో తొలగించబడిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలు మరియు గురుకుల సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అలాగే మెమో57 ప్రకారం అర్హులైన 11 వేల మంది ఉద్యోగులకు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డి.వి. రమణ ఆదేశాల మేరకు ఈ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తక్షణమే పీఆర్సీ కమిటీని నియమించి,మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే సిఫారసు చేయాలని కోరారు.జులై 26లోపు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసన్, రెడ్డెప్ప నాయుడు, సి. బాబు రెడ్డి, వెంకట రమణ రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, నాగేశ్వర్, వెంకట రమణ, మురళి, మనోహర్, శివప్రసాద్, రమేష్ బాబు, బాలకృష్ణ, రెడ్డి వరప్రసాద్, మంజునాథ్ పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పటిష్టంగా పూర్తి చేయాలి

### డిజిటలైజేషన్ వేగవంతం చేసి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

### మదనపల్లి,కురబలకోటలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆదివారం మదనపల్లి మండలం చిప్పిలి గ్రామం, కురబలకోట మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వే, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు.సేకరించిన సమాచారాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేసి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం ప్రజాస్వామ్య ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.బీఎల్‌ఓలకు అప్పగించిన విధులను వారే స్వయంగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులకు బాధ్యతలు అప్పగించరాదని స్పష్టం చేశారు.అలాగే ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమానత్వం, నిష్పాక్షికతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వెంటనే పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు కూడా ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఒక వరం.

### రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి.



**అన్నమయ్య జులై 05(పిసిడబ్ల్యూ న్యూస్):**-సీఎం చంద్రబాబు దూరదృష్టితో రాయలసీమలో పారిశ్రామిక విప్లవంకు నాంది పలుకుతోందని పెట్టుబడుల ప్రవాహంతో అభివృద్ధి పథంలో స్వర్ణాంధ్ర ఆంధ్రప్రదేశ్ గా మారనందునదని,యువతకు ఉపాధి..రాష్ట్రానికి ప్రగతి..ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అనిమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రవాణా,యువజన,క్రీడాశాఖల మంత్రి శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.రాయలసీమలో రూ.16,350 కోట్ల పెట్టుబడితో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి కొత్త దిశ లభిస్తుంద న్నారు.పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం,యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడం అనే లక్ష్యాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పనిచేస్తున్నారని మంత్రి కొనియాడారు.రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకుంటోందని తెలిపారు.రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని,ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి,యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పారిశ్రామికంగా,ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఆ 33 బంతులే కొంపముంచాయ్



ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 190 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, ఒకానొక దశలో 200 పరుగులను అలవోకగా దాటేలా కనిపించిన భారత్, మిడిల్ ఓవర్లలో చేసిన కొన్ని చిన్నపాటి తప్పుల వల్ల ఆ మైలురాయిని అందుకోలేకపోయింది.అదిరిపోయే ఆరంభం ఇచ్చిన ఓపెనర్లు ..మాంచెస్టర్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు యువ ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన పునాది వేశారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు తొలి వికెట్‌కు కేవలం ఐదు ఓవర్లలోనే 50 పరుగులు జోడించి ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. జట్టు స్కోరు 65 పరుగుల వద్ద ఉన్నప్పుడు సూర్యవంశీ, అభిషేక్ శర్మ ఇద్దరూ అవుట్ అయినప్పటికీ, వారు అందించిన వేగం జట్టుకు ఎంతగానో ఉపయోగపడింది.శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ మెరుపులు..పవర్‌ప్లే ముగిసిన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మైదానంలో పరుగుల వరద పారించాడు. కేవలం 22 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు చేసి భారత స్కోరును వేగంగా ముందుకు నడిపించాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దిన అయ్యర్, జట్టు స్కోరును 12.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 130 పరుగులకు చేర్చాడు. ఈ దశలో భారత్ కనీసం 210 పరుగులైనా చేస్తుందని అందరూ భావించారు.ఆ 33 బంతులు.. కొంపముంచిన తడబాటు

13వ ఓవర్ చివరి బంతికి శ్రేయస్ అయ్యర్ అవుట్ కావడంతో భారత ఇన్నింగ్స్ ఒక్కసారిగా మందగించింది. 13వ ఓవర్ నుండి 18.3 ఓవర్ల మధ్య భారత్ వరుసగా 4 వికెట్లు కోల్పోయింది. ఈ 33 బంతుల్లో భారత బ్యాటర్లు కేవలం 34 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఇక్కడే రన్‌రేట్ ఘోరంగా పడిపోయింది. సామ్ కరన్ బౌలింగ్‌లో శివం దుబే కేవలం 5 పరుగులు (7 బంతులు) చేసి అవుట్ కాగా, ఇషాన్ కిషన్ 49 పరుగులు చేసినప్పటికీ దాని కోసం ఏకంగా 40 బంతులు తీసుకున్నాడు. అక్షర్ పటేల్ కూడా కేవలం 2 పరుగులకే రన్ అవుట్ కావడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది.ఆదుకున్న తిలక్ వర్మ..

మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో తక్కువ స్కోరుకే పరిమితం అవుతుందనుకున్న తరుణంలో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ జట్టును ఆదుకున్నాడు. చివరి ఓవర్లో జోఫ్రా ఆర్చర్ వేసిన మొదటి మూడు బంతుల్లో 2 సిక్సర్లు, ఒక ఫోర్ బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. తిలక్ కేవలం 11 బంతుల్లో 24 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడంతోనే భారత్ 190 పరుగుల గౌరవప్రదమైన స్కోరునైనా అందుకోగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరన్ 3 వికెట్లతో భారత మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు.

# 10 ఏళ్లలో కోటీశ్వరులు కావాలా.. నెలకు ఎంత SIP చేయాలో తెలుసుకోండి!



ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఒక పెద్ద ఆర్థిక లక్ష్యం ఉంటుంది.

అయితే, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఖీఐ) లేదా బంగారం కొనుగోలు చేయడం ద్వారా కోటి రూపాయల వంటి భారీ నిధిని సంపాదించుకోవాలనే ఆశతో దశాబ్దాల కాలం వేచి చూడాల్సి వస్తుంది. ఒకవేళ మీరు కేవలం 10 ఏళ్ల మధ్యకాలిక వ్యవధిలోనే కోటీశ్వరులు కావాలని లక్ష్యంగా పెట్టుకుంటే, దానికి మ్యూచువల్ ఫండ్స్‌లో ూఎ్రూ ఒక అత్యుత్తమమైన, క్రమశిక్షణతో కూడిన మార్గంగా మారుతుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. 10 ఏళ్లలో రూ. 1 కోటి: ఎంత పెట్టుబడి పెట్టాలి?:

మ్యూచువల్ ఫండ్స్ క్యాల్కులేటర్ ప్రకారం.. 10 ఏళ్లలో కోటి రూపాయల మైలురాయిని అందుకోవడానికి మీరు ప్రతి నెలా ఇన్వెస్ట్ చేయాల్సిన మొత్తం, మీ పెట్టుబడిపై వచ్చే వార్షిక రాబడి (=వ్‌బతీఅం) శాతంపై ఆధారపడి ఉంటుంది. ఆ లెక్కలు ఇలా ఉన్నాయి:12శాతం వార్షిక రాబడి లభిస్తే: ఒకవేళ మీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిపై సగటున ఏడాదికి 12 శాతం వడ్డీ లభిస్తే, 10 ఏళ్లలో రూ. 1 కోటి పూర్తి కావడానికి మీరు ప్రతి నెలా రూ. 43,150 చొప్పున ూఎ్రూ చేయాలి. 10 సంవత్సరాల తర్వాత మీ వద్ద సుమారు రూ. 1,00,25,431 నిధి సిద్ధంగా ఉంటుంది. మీ బెడ్‌రూమ్‌లో ఈ మొక్క ఉంటే చాలు.. ఆరోగ్యం,ప్రశాంతత మీ సొంతం!

14శాతం వార్షిక రాబడి లభిస్తే: స్టాక్ మార్కెట్ పనితీరు బాగుండి, మీకు వార్షికంగా 14 శాతం రిటర్న్ వస్తే, మీ నెలవారీ పెట్టుబడి భారం తగ్గుతుంది. అప్పుడు మీరు నెలకు రూ. 38,250 ఇన్వెస్ట్ చేస్తే సరిపోతుంది. ఇది 10 ఏళ్లలో రూ. 1,00,24,995 అవుతుంది. 16శాతం వార్షిక రాబడి లభిస్తే: ఒకవేళ మీరు ఎంచుకున్న ఫండ్స్ అత్యుత్తమంగా రాణించి 16 శాతం వరకు వార్షిక రాబడిని అందిస్తే, మీ నెలవారీ భారం మరింత తగ్గుతుంది. మీరు నెలకు కేవలం రూ. 33,750 పెట్టుబడి పెడితే చాలు, 10 ఏళ్లలో రూ. 1,00,05,913 మార్కును సులభంగా దాటవచ్చు. ఇక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 10 శాతానికి మించి వార్షిక రాబడిని ఆశించే వారికి ఇక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే ఫండ్స్) ఏకైక ప్రత్యామ్నాయం. డెట్ ఫండ్స్ లేదా ప్రభుత్వ పొదుపు పథకాలలో ఇంత పెద్ద మొత్తంలో రిటర్న్ రావడం కష్టం. కాబట్టి మీ లక్ష్యం 10 ఏళ్లలో కోటి రూపాయలు అయితే, మీ పెట్టుబడిలో సింహభాగం ఇక్విటీ ఫండ్స్‌లో ఉండాలి. అయితే, ఇక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ అస్థిరతలకు లోబడి ఉంటాయి.. కాబట్టి, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే ముందు ఒక సర్టిఫైడ్ ఆర్థిక సలహాదారుని సంప్రదించడం ఎల్లప్పుడూ శ్రేయస్కరం.

# 'ఇంగ్లాండ్‌లో ఐపీఎల్ పిచ్‌లు ఉండవురా బాబూ



అద్భుతమైన ఐపీఎల్ ఫామ్‌తో, ఎన్నో భారీ అంచనాల నడుమ భారత జాతీయ జట్టులోకి అడుగుపెట్టిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీకి తొలి మ్యాచ్‌లోనే చేదు అనుభవం ఎదురైంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ కుర్రాడు దారుణంగా విఫలమయ్యాడు. దీంతో నెట్టింట భారత అభిమానులు అతడిపై విమర్శల వర్షం కురిపిస్తూ తీవ్ర స్థాయిలో ట్రోల్ చేస్తున్నారు.

ఆరంభం అదుర్స్.. ముగింపు బెదుర్స్..!

మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ ద్వారా వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. సీనియర్ ఆటగాడు, వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ సభ్యుడు సంజూ శాంసన్‌ను పక్కనపెట్టి మరీ టీమిండియా మేనేజ్‌మెంట్ ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఓపెనర్‌గా అవకాశం ఇచ్చింది. ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన వైభవ్.. ఆ తర్వాత అదే ఊపును కొనసాగించలేకపోయాడు. క్రీజులో ఎదుర్కొన్నది 10 బంతులే అయినా అందులో కేవలం 14 పరుగులు మాత్రమే చేసి, పార్ట్ టైమ్ స్పిన్నర్ విల్ జాక్స్ బౌలింగ్‌లో జోస్ బట్లర్‌కు చిక్కి స్టంపౌట్ అయ్యాడు. ఎంతో ఉత్కంఠగా అతడి బ్యాటింగ్ కోసం ఎదురుచూసిన అభిమానులకు ఈ ప్రదర్శన తీవ్ర నిరాశను మిగిల్చింది.సచిన్ రికార్డు బద్దలు.. కానీ ప్రదర్శన నిరాశ!

ఈ మ్యాచ్‌తో వైభవ్ సూర్యవంశీ ఒక అరుదైన చరిత్ర సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులో బరిలోకి దిగి, అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడైన భారతీయ క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. 1989లో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేసి దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు. అయితే, రికార్డులటైమ్ స్పిన్నర్ విల్ జాక్స్ బౌలింగ్‌లో జోస్ పరంగా సచిన్‌ను దాటేసినా, మైదానంలో మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక విమర్శల పాలయ్యాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద పారించి ఏకంగా ఆరెంజ్ క్యాప్ కైవసం చేసుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఇంగ్లాండ్ గడ్డపై మాత్రం తేలిపోయాడు. దీంతో నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా అతడిని ఆటాడుకుంటున్నారు. "ఇంగ్లాండ్‌లో ఐపీఎల్ తరహాలో ఉండే ఫ్లాట్ పిచ్‌లు ఉండవు తమ్ముడూ.. ఇక్కడ బంతి స్వింగ్ అవుతుంది, పరుగులు చేయడం అంత సులువు కాదు" అంటూ ఘాటుగా కామెంట్లు పెడుతున్నారు. "కేవలం ఒక అద్భుతమైన ఐపీఎల్ సీజన్ చూసి, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలతో పోల్చడం మానేయాలి" అని మరికొందరు విమర్శిస్తున్నారు

# గృహ బీమా తీసుకోవడం మంచిదేనా..? ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి..?



చాలామంది తమ సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు డబ్బులు పొదుపు చేసుకుంటూ ఉంటారు. తమ కష్టార్జితం మొత్తాన్ని కూడబెట్టుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అయ్యే మెటిరీయల్ ఖర్చులు పెరుగుతున్న క్రమంలో సొంతిల్లు నిర్మాణానికి అదనపు ఖర్చు అవుతుంది. దీంతో పొదుపు చేసుకున్న డబ్బులు సరిపోకపోవడం వల్ల బ్యాంకుల నుంచి హోమ్ లోన్లు తీసుకుంటున్నారు. హోమ్ లోన్లకు వడ్డీ రేటు చాలా తక్కువగా ఉంటుంది. దీంతో చాలామంది ఈ లోన్లను తీసుకుంటూ ఉంటారు. అయితే హోమ్ లోన్ తీసుకున్నప్పుడు ఇంటికి బీమా తీసుకోవడం అవసరమా.. లేదా అనే విషయాలు తెలుసుకుందాం. హోమ్ ఇన్స్యూరెన్స్ ఎలా పనిచేసుంది..?గృహ బీమా అనేది చాలా ఉపయోగపడుతుంది. రుణ గ్రహీతకు ఏదైనా లపడకుండా ఇది కాపాడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన రుణాన్ని బీమా సంస్థ బ్యాంకులకు చెల్లిస్తుంది. దీని వల్ల ఈఎంఐ చెల్లించే చింతను తొలగిస్తుంది. లోన్ తీసుకున్న వ్యక్తి చనిపోతే బీమా సంస్థ మిగిలిన హోమ్ భూకంపాలు లాంటి ప్రమాదాల వల్ల మీ ఇంటికి హాని జరిగితే బీమా వర్తిస్తుంది. ఎప్పుడు తీసుకోవాలి..?రుణ తీసుకున్న వ్యక్తి పేరుపై ఎలాంటి లైఫ్ ఇన్స్యూరెన్స్ లేని సమయంలో గృహ బీమా అనేది తీసుకోవాలి. ఒకవేళ రుణం పొందిన వ్యక్తికి జీవిత బీమా ఉంటే హోమ్ ఇన్స్యూరెన్స్ అనేది ముఖ్యం కాదు. ఇక మీ కుటుంబాన్ని మీరు ఒక్కరే పోషిస్తుంటే గృహ బీమా అనేది తీసుకోవాలి. ఇక గృహ బీమా ప్రీమియం విషయానికొస్తే.. ప్రీమియంను ఒకేసారి చెల్లిస్తారు. ఒక్కోసారి వార్షికంగా చెల్లిస్తారు. కొన్నిసార్లు బ్యాంకులు దీనిని గృహ రుణానికి జోడించి ఈఎంఐతో పాటు క్రమంగా చెల్లించేలా చేస్తాయి.

# టీమిండియా ఫ్యాన్స్‌కు మళ్లీ నిరాశే..




ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో టీమిండియా ఓటమి చెందింది. మాంచెస్టర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. 20 ఓవర్లలో 190-7 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యాన్ని చేధించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్.. 19 ఓవర్లలో 191-6 పరుగులతో గెలుపును సొంతం చేసుకుంది. తొలి టీ 20 వర్షం కారణంగా రద్దవ్వగా.. రెండో టీ20లో భారత్ రాణించలేకపోయింది. దీంతో రెండో టీ20 ఇంగ్లండ్ వశమైంది. భారత బ్యాటర్లలో అభిషేక్ శర్మ 43(24), ఇషాన్ కిషన్49(40), శ్రేయస్ అయ్యర్37(22), తిలక్ శర్మ 24(11) పరుగులతో రాణించారు.

ఇక ఇంగ్లండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ 39(15), టామ్ బాంటన్ 39(32), జాకబ్ బెథెల్ 76(46) పరుగులతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కర్రన్ 3, జోఫ్రా ఆర్చర్ 1, విల్ జాక్స్ 1 వికెట్ తీశారు.కాగా తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. 20 ఓవర్లలో 189-7 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (59), శ్రేయస్ అయ్యర్ (47 బంతుల్లో 68) పరుగులతో రాణించారు. ఆఖర్లో శివమ్ దూబే (21 బంతుల్లో 42 నాటౌట్)గా నలిచాడు.

కానీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో టీమిండియా ఫ్యాన్స్ నిరాశ చెందారు.

# ఉన్నపళంగా పాత బంగారం అమ్మేస్తున్న భారతీయులు



రికార్డు స్థాయికి చేరిన తర్వాత బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశవ్యాప్తంగా అనేక కుటుంబాలు తమ వద్ద ఉన్న పాత బంగారు ఆభరణాలను విక్రయించి నగదుగా మార్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ధరలు మరింత తగ్గే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న అధిక ధరలను సద్వినియోగం చేసుకోవాలని చాలామంది భావిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (×దీజీూ) గణాంకాల ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతీయ కుటుంబాలు దాదాపు 50 టన్నుల పాత బంగారాన్ని విక్రయించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 43 శాతం అధికం. బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరిన సమయంలో లాభాలను పొందేందుకు ప్రజలు పెద్దఎత్తున అమ్మకాలకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో బంగారం ధరలు చరిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరగా, ఇటీవల అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో కొంత తగ్గాయి. ప్రస్తుతం ధరలు ఇంకా అధికంగానే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో మరింత తగ్గవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగంలో లేని పాత ఆభరణాలను విక్రయించి నగదు పొందాలని అనేక కుటుంబాలు నిర్ణయించుకుంటున్నాయి. ఐబీజేఏ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా మాట్లాడుతూ.. అధిక ధరలను లాభంగా మార్చుకునేందుకు వినియోగదారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ధరలు మరింత తగ్గే అవకాశం ఉందనే భావన కూడా అమ్మకాలకు ప్రధాన కారణంగా మారిందన్నారు. పాత బంగారం విక్రయాలు పెరగడంతో దేశంలోని బంగారం రీసైక్లింగ్ పరిశ్రమకు కూడా ఊతం లభిస్తోంది. గృహాల్లో నిరుపయోగంగా ఉన్న ఆభరణాలను సేకరించి వాటిని శుద్ధి చేసి మళ్లీ ఆభరణాల తయారీదారులకు సరఫరా చేస్తున్నారు.

ముత్తూట్ ఎగ్జిమ్ సంస్థ తన గోల్డ్ పాయింట్ల నెట్‌వర్క్‌లో పాత బంగారం లావాదేవీలు 40 శాతం పెరిగినట్లు వెల్లడించింది. వినియోగదారులు పారదర్శకమైన వ్యవస్థీకృత మార్గాల్లో బంగారాన్ని విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారని సంస్థ సీఈఓ కీయూర్ షా పేర్కొన్నారు.ప్రపంచంలో అత్యధికంగా బంగారం వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే దేశ అవసరాల్లో అధిక భాగం దిగుమతుల ద్వారానే తీరుతోంది. ప్రస్తుతం రీసైకిల్ అయ్యే బంగారం పరిమాణం పెరగడం వల్ల దిగుమతులపై ఆధారపడటం కొంత మేర తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30 వేల టన్నుల బంగారం నిల్వ ఉందని అంచనా వేస్తున్నారు. అయితే బంగారాన్ని విక్రయించే నిర్ణయం కేవలం ధరల హెచ్చుతగ్గులను చూసి కాకుండా, వ్యక్తిగత ఆర్థిక అవసరాలు, భవిష్యత్తు పెట్టుబడి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వినియోగంలో లేని పాత ఆభరణాలను నగదుగా మార్చుకోవడానికి ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక పెట్టుబడిగా బంగారం ఇప్పటికీ కీలకమైన ఆస్తిగానే పరిగణించబడుతోంది.



# నేను తెలుగు వాడినే.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్


ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు శ్రీమన్. వందలాది చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన ఆయన తెలుగు ప్రేక్షకులకు సైతం సుపరిచితమే. అయితే తాను పక్కా తెలుగువాడినని.. కానీ ఈ విషయం చాలా మందికి తెలియదని అంటున్నారు శ్రీమన్. తనకు ఒక్క ఛాన్స్ వస్తే తానేంటో నిరూపించుకుంటానని అంటున్నారు.తమిళ చిత్ర పరిశ్రమలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు శ్రీమన్. వందలాది తమిళ సినిమాల్లో నటించినప్పటికీ, ఆయన పక్కా తెలుగువాడు అనే విషయం చాలా మందికి తెలియదు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా, మామిడాడ గ్రామానికి చెందిన శ్రీమన్.. సొంత మాతృభాష అయిన తెలుగులో సరైన గుర్తింపు రాలేదనే బాధతో ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఆయన ఆవేదనను గుర్తించి, టాలీవుడ్‌లో ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా పెద్ద బ్రేక్ ఇచ్చారు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి. గతంలో హైదరాబాద్‌లో విజయ్ 'వారిసు' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో, నిర్మాత దిల్ రాజు ద్వారా అనిల్ రావిపూడితో శ్రీమన్‌కు పరిచయం ఏర్పడింది. ఆ సమయంలోనే శ్రీమన్ తన మాతృభాషలో నటించాలనే కోరికను దర్శకుడికి తెలియజేశారు. శ్రీమన్ ప్రతిభను గుర్తించిన అనిల్ రావిపూడి, ప్రస్తుతం వెంకటేష్ , కల్యాణ్ రామ్ కాంబినేషన్‌లో తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక మల్టీస్టారర్ చిత్రంలో ఆయనకు ఒక అద్భుతమైన, కీలకమైన పాత్రను అందించారుఈ తెలుగు సినిమా అవకాశం కోసం శ్రీమన్ తమిళంలో అప్పటికే ఒప్పుకున్న నాలుగు పెద్ద సినిమాలను కూడా వదులుకోవడం విశేషం. సొంత భాషలో నటించడం కోసం ఆయన చేసిన ఈ త్యాగాన్ని తమిళ దర్శకులు, ఆయన స్నేహితులు కూడా ఎంతగానో అభినందిం చారు. ఇప్పటికే వారం రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్న శ్రీమన్, ఈ సినిమా సెట్స్‌లో ఉన్న ఎనర్జీ , అయ్యారు."అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు" అనే సామెతను గుర్తుచేస్తూ, అనిల్ రావిపూడి సినిమాతో తెలుగులో తనకున్న పెద్ద వెలితి తీరిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దాదాపు రెండు మూడేళ్ల తర్వాత మళ్లీ తెలుగులో డైలాగులు చెప్పడం తనకు ఎనకామెడీ టైమింగ్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సోషల్ మీడియా వేదికగా ఎవెకామెడీ టైమింగ్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ ాషనల్ లేని ఆనందాన్ని ఇస్తోందని శ్రీమన్ పేర్కొన్నారు. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు శ్రీమన్ మరింత దగ్గరవ్వాలని, టాలీవుడ్‌లో ఆయనకు మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఆశిద్దాం.



రెజీనా కాసాండ్రా.. ఈ అందాల భామ ఒకానొక సమయంలో టాప్ హీరోయిన్ గా రాణించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది.తెలుగులో "శివ మనసులో శృతి" ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.తెలుగులో "శివ మనసులో శృతి" ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చిలడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా ంది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది. ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది. ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.

గతంలో రెజీనా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో వచ్చిన "అ" సినిమా స్క్రిప్ట్ చెప్పారు. నాకు హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తే చేస్తా.. లేదా ఏదైనా కీలకమైన , నటనకు ప్రాధలడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగాాన్యత ఉన్న పాత్ర ఇస్తే చేస్తా అని చెప్పిందట.. అయితే హీరోయిన్ గా ఇప్పటికే కాజల్ ను ఫిక్స్ చేశాం అని చెప్పారు. సరే మరో బలమైన పాత్ర ఇవ్వమని అడిగాను. లేదంటే సినిమా చేయను అని తెగేసి చెప్పా అని తేలింది.

# గత్తరలేపిన రెజీనా కాసాండ్రా.




## అన్న ఎన్టీఆర్‌కు 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ' బిరుదు ఎలా వచ్చిందో తెలుసా..?

ఎన్టీఆర్ భారతీయ సినిమా చరిత్రలో ఒక అగ్ర నటుడు. ఆయన పోషించిన అనేక పాత్రల వల్ల ఆయనకు పేరు ప్రఖ్యాతులు లభించాయి. అదే సమయంలో, ఆయన నటించడం వల్ల కొన్ని పాత్రలకు అమితమైన గుర్తింపు దక్కింది. రాముడు, కృష్ణుడు, భీముడు, భీష్ముడు, కర్ణుడు, దుర్యోధనుడు, అర్జునుడు వంటి పౌరాణిక పాత్రలు పోషించినప్పుడు ఆ పురాణ పురుషులందరూ ఎన్టీఆర్‌లోకి పరకాయ ప్రవేశం చేశారని చెప్పాలి. ఆయన రూపంలో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కృష్ణుడు ఇలా, రాముడు అలా ఉండేవాడు కాబోలు అని జనాన్ని మురిపించి, ఆనందపారవశ్యంతో మైమరచిపోయే విధంగా ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలు విశ్వవిఖ్యాతమయ్యాయి. అందుకే ఆయనను విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు అని పిలుచుకున్నారు. ఈ అపురూపమైన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ అనే బిరుదు ఎన్టీఆర్‌కు ఎలా వచ్చిందో, ఎవరు ఇచ్చారో తెలుసుకోవడం ఆసక్తికరం. 1963 ఆరంభంలో జరిగిన ఒక దైవిక సంఘటనతో ఈ బిరుదు ఆయన జీవితంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో ఎన్టీఆర్ నటించిన నర్తనశాల చిత్రం విడుదలై విజయవిహారం చేస్తోంది. ఆ సినిమాలో ఎన్టీఆర్ పోషించిన బృహన్నల పాత్రకు అద్భుతమైన స్పందన వచ్చింది. అరివీర భయంకరుడైన అర్జునుడిగా, శాపవశాత్తూ అర్ధనారిగా మారిన బృహన్నలగా ఎన్టీఆర్ ప్రదర్శించిన నటన అసామాన్యమైనది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ ఒకరోజు గుంతకల్లుకు వెళ్లారు. సినిమా పంపిణీ రంగానికి కోస్తా ఆంధ్రలో విజయవాడ, నైజాంలో సికింద్రాబాద్ ఎలాగో, ఆ రోజుల్లో సీడెడ్‌లో గుంతకల్లు కూడా అలాగే ముఖ్యమైన కేంద్రం. సీడెడ్ అంటే రాయలసీమ జిల్లాలు. ఎన్టీఆర్ నటుడే కాదు, నిర్మాత కూడా. ఆయన సినిమాల పంపిణీ వ్యవహారాలను అట్లూరి బలరాం చూసుకునేవారు. నిర్మాత పుండరీకాక్షయ్యకు సొంత తమ్ముడే బలరాం. ఎన్టీఆర్‌కు పుండరీకాక్షయ్య దగ్గరి బంధువు, అత్యంత సన్నిహితుడు. గుంతకల్లు పర్యటనలో పనులన్నీ పూర్తయ్యాక, తిరుగు ప్రయాణానికి

# ప్రభాస్ చెప్పిన మాటలు జీవితంలో మార్చిపోలేను



విలక్షణ నటుడు రాజేంద్ర ప్రసాద్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఒకప్పుడు హీరోగా అలరించిన ఆయన.. ఇప్పుడు సహాయ నటుడిగా రాణిస్తున్నారు. తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలను చూశారు. అయితే, ఆయన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఒక తీరని విషాదం సందర్భంగా తెలుగు సినిమా పరిశ్రమ ఆయనకు చూపిన అపూర్వ ప్రేమ, మద్దతు గురించి గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. తన కుమార్తె మరణం తర్వాత సినీ రంగం మొత్తం తన పట్ల చూపిన అభిమానం తనకెప్పటికీ గుర్తుండిపోతుందని రాజేంద్ర ప్రసాద్ భావోద్వేగంగా పంచుకున్నారు. తన కుమార్తె మరణించినప్పుడు ప్రభాస్ లాంటి స్టార్ హీరో స్వయంగా తన ఇంటికి వచ్చి ఓదార్చడం తనను ఎంతగానో ఆశ్చర్యపరిచిందని అన్నారు. సాధారణంగా ప్రభాస్ బహిరంగ కార్యక్రమాలకు, ఇండస్ట్రీలో చాలా తక్కువగా బయటికి వస్తారని, అలాంటిది తన ఇంటికి వచ్చి పర్సనల్‌గా కలవడం ఆయన గొప్పదనానికి నిదర్శనం అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రభాస్ కేవలం పరామర్శించడమే కాదు, రాజేంద్ర ప్రసాద్‌కి ధైర్యాన్నిస్తూ "మీరు మాకు కావాలి. మీరు మాత్రం తగ్గద్దు, డల్ అవ్వద్దు. మీతో మాకు చాలా పని ఉంది. మీరు హుషారుగా ఉండండి ప్లీజ్" అని అన్నారని, ఆ మాటలు తనకెంతో ఆసరాగా నిలిచాయని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మాటలను తానెప్పటికీ మర్చిపోలేనని తెలిపారు.



# మేం సరదా సరదాగానే సినిమాలు చూస్తాం

ఓటీటీలో చాలా సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అటు థియేటర్స్ లో కొత్త సినిమాలు మంచి విజయాలను అందుకుంటుంటే.. ఓటీటీలో రిలీజ్ అయిన సినిమాల కూడా ప్రేక్షకులను విశేషంగా మెప్పిస్తున్నాయి. కొన్ని సినిమాలు థియేటర్స్ లో ఆకట్టుకోలేకపోయిన సినిమాలు కూడా ఓటీటీలో మెప్పిస్తాయి. థియేటర్లలో డిజాస్టర్ అయిన చిత్రాలు సైతం డిజిటల్ ప్లాట్ ఫామ్ లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఓ సినిమా కొన్నేళ్ళుగా ఓటీటీలో దుమురేపుతుంది. ఈ సినిమా మొత్తం ఓ ఎత్తు క్లైమాక్స్ ఒకెత్తు.. ఆ సినిమా మరేదో కాదు కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి నటించి దర్శకత్వం వహించిన కాంతార. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ముందు కన్నడలో రిలీజ్ చేశారు. అక్కడ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఆతర్వాత ఇతర భాషల్లో విడుదల చేశారు. ఈ చిత్రానికి అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే.2022 సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన నిలిచింది ఈ సినిమా. థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా మారింది. కేవలం రూ. 14 కోట్లతో నిర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద మొత్తం వసూళ్లు రూ. 400 నుండి 450 కోట్ల వరకు కలెక్షన్స్ రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. దాదాపు 6 ఏళ్లుగా ఓటీటీలో ట్రెండ్ అవుతుంది ఈ సినిమా. ఈ సినిమాకు ప్రీక్వెల్ కూడా తెరకెక్కింది. ఆ సినిమా కూడా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో 'కాంతార'కి ముందు కథను చూపించారు. ఈ సినిమాకు కూడా రిషబ్ శెట్టి స్వయంగా రచన, దర్శకత్వం వహించారు. హోంబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్, చలువే గౌడ నిర్మించారు.కాంతార సినిమాలో రిషబ్ శెట్టితో పాటు సప్తమి గౌడ, కిషోర్, అచ్యుత్ కుమార్ నటించారు. ఈ చిత్రానికి రిషబ్ శెట్టి 70వ జాతీయ చలనచిత్ర అవార్డులలో ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్నారు. అలాగే ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా అవార్డును అందుకుంది. కర్ణాటకలోని ఒక మారుమూల గ్రామంలో జరిగిన కథతో ఈ సినిమాను తెరకెక్కించారు ఆ ప్రాంత సంప్రదాయం.. మనిషి దురాశను చూపిస్తుంది. స్థానిక జానపద కథలు, ఆచారాలు, కర్ణాటకలోని దక్షిణ కన్నడలోని ప్రసిద్ధ సంప్రదాయం భూత కోలను ఎంతో అందంగా వెండితెరపైకి తీసుకువచ్చారు. ప్రస్తుతం కాంతార చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.